# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక

నల్లగొండ | సంపుటి:16 | సంచిక:83 | ఎడిటర్: సయ్యద్ పాష | 09-04-2026 గురువారము | పేజీలు :8 | వెల:1/-



## లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలకు:

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,


## బంగాల్ కాంగ్రెస్ ఎన్నికల హామీలు

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల వేళ బంగాల్ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ భారీ హామీలు ప్రకటించింది. బంగాల్‌లో అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు నెలకు 2 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని పేర్కొంది. ఈ మేరకు ఎన్నికల మ్యానిఫెస్టోను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని ఖర్గే తెలిపారు. విద్యార్థినులకు పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు.దీనికయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని ఖర్గే పేర్కొన్నారు. సన్నకారు, భూమిలేని రైతులకు ఏడాదికి 15 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించారు. వ్యవసాయ అవసరాల కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని ఖర్గే స్పష్టం చేశారు. 'యువ సమ్మాన్' పథకం కింద ప్రభుత్వంలో ఉన్న ఖాళీ పోస్టులను ఏడాదిలోగా భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. బంగాల్‌లోని ప్రతి జిల్లాలో కృత్రిమ మేధ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఖర్గే వెల్లడించారు.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో
## టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఎండీ భేటీ



హైద్రాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ ( మేనేజింగ్ డైరెక్టర్ టిమ్ రైఫిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో విమానయాన మరియు రక్షణ రంగాల్లో పెట్టుబడుల విస్తరణపై ప్రధానంగా చర్చించారు. భారత్‌లో ప్రసిద్ధ 'జ130జీ సూపర్ హెర్క్యులస్' విమానాల ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయాలన్న లాక్‌హీడ్ మార్టిన్ నిర్ణయం ఈ భేటీలో కీలకంగా మారింది. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణలో మరిన్ని ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. అంతర్జాతీయ రక్షణ రంగ దిగ్గజం లాక్‌హీడ్ మార్టిన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ తో కుదుర్చుకున్న ఒప్పందంపై కూడా ఈ భేటీలో చర్చకు వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం, దేశంలోని TASL కేంద్రంలో ఎఫ్-16 యుద్ధ విమానాల రెక్కలను ఉత్పత్తి చేయనున్నారు. తెలంగాణలో ఉన్న అనుకూలమైన పారిశ్రామిక విధానాలు మరియు నైపుణ్యం కలిగిన మానవ వనరుల పట్ల టిమ్ రైఫిల్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సంస్థ ఆసక్తిగా ఉందని ఆయన ముఖ్యమంత్రికి వివరించారు.

# పేదలకు మెరుగైన వైద్యం




నల్లగొండ: ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినీ మౌలిక శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6 నుంచి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా బుధవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని మాన్య ంచల్కలో కోటి 91 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సేవల మెరుగుదలకు కొత్త చర్యలు చేపట్టామని, జిల్లా ఆసుపత్రిలో ఈ రోజుల్లో ఏర్పాటు చేసిన మాన్యువల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ప్రజా ప్రతినిధుల సహకారంతో 50 లక్షల రూపాయలు కేటాయించామని తెలిపారు. మాన్య ంచల్కయూపిహెచ్‌సీకి నూతన భవనాన్ని నిర్మించడమే కాకుండా, అవసరమైన మెడికల్ సామాగ్రిని ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందాకావనర్మేతే ఎక్విప్‌మెంట్ సమకూర్చామన్నారు. మాట్లాడిన ప్రజలు, మాన్య ంచల్క యూపిహెచ్‌సీకి నూతన భవనాన్ని నిర్మించడమే కాకుండా, అవసరమైన మెడికల్ సామాగ్రిని ఏర్పాటు చేయడం జరిగింది. ఇకడే అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని, పరీక్షలతో పాటు, అవసరమైన ప్రాథమిక చికిత్సను ఆసుపత్రి రిఫర్ చేసే విధంగా వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, మేయర్, మాజీ మున్సిపల్ చైర్మెన్, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నర్సింహారావు నెల, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వి ఎం గోపాల్ రెడ్డి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ కె ఖాజా చక్రవర్తి, యూపిహెచ్‌సీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

### తెలుగు రాష్ట్రాల్లోని
## ప్రయాణికులకు గుడ్ న్యూస్..



హైద్రాబాద్: విద్యార్థులకు పరీక్షలు పూర్తయ్యాయి. వారికి వేసవి సెలవులు ప్రకటించేశారు. దీంతో తల్లిదండ్రులతో కలిసి వారంతా ఊర్లకు ప్రయాణం అవుతున్నారు. అలాగే పెళ్లిళ్ల సీజన్ కూడా కావడంతో రవాణా వాహనాలు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. రైళ్లలో సైతం రెండు నెలల క్రితమే బర్త్‌లన్ని నిండిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాలు.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మీదగా పలు ప్రత్యేక రైల్వే సర్వీసులను నడుపుతున్నట్లు ప్రకటించింది. అలాగే కొన్ని రైల్వే సర్వీసులను పొడిగించినట్లు వివరించింది. ఈ ప్రత్యేక రైళ్లతోపాటు పొడిగించిన రైల్వే సర్వీస్ సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. చర్లపల్లి-తిరుచానూరు, తిరుపతి-అకోలా, కాచిగూడ-తిరుచానూరు, తిరుపతి- చర్లపల్లి, నాందేడ్-తిరుచానూరు, చర్లపల్లి-తిరుచానూరు, సికింద్రాబాద్-అనకాపల్లి, తిరుపతి-నరసాపూర్, నాందేడ్-ధర్మవరం, చర్లపల్లి-నరసాపూర్, కాకినాడ టౌన్- లింగంపల్లి, లింగంపల్లి-కాకినాడ టౌన్, చర్లపల్లి-కాకినాడ టౌన్, జల్నా-తిరుచానూర్, చర్లపల్లి-అనకాపల్లి, సికింద్రాబాద్-అనకాపల్లి, కాకినాడ టౌన్- మైసూర్, చర్లపల్లి- భువనేశ్వర్ న్యూ, తిరుపతి-పందార్‌పూర్, హైదరాబాద్-బెళగావి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతుంది.

## అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణపై ఫోకస్



హైదరాబాద్, : ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణపై ఫోకస్ చేస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా ఉన్నా.. రేవంత్ వైపు గాలి వీచిందని తెలిపారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ లక్ష్మణ్ విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ఎవరూ ఊహించలేదన్నారు. తెలంగాణ ప్రజలు తెలివైన వారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లు వచ్చినా.. 38 శాతం ఓట్లు ప్రజలు ఇచ్చారని ఎంపీ లక్ష్మణ్ వివరించారు. వచ్చే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీదే పైచేయి అవుతుందని ఈ సందర్భంగా ఆయన జోస్యం చెప్పారు. ఒక ఎన్నిక తీసుకుని ఎప్పుడూ అంచనా వేయడం తప్పు అని అభిప్రాయపడ్డారు. మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లు తరువాత.. మొత్తం వన్ సైడేనని అన్నారు. ఇప్పటికే మహిళా బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయనే విషయం ప్రజల్లోకి వెళ్లిందని తెలిపారు. బట్ట కాల్చి మీద వేస్తే.. ప్రజలు అంత అమాయకులు కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చునని చెప్పారు. తమిళనాడులో టీవీకే పార్టీ అధినేత విజయ్ సమావేశాలకు ప్రజలు భారీగా వస్తున్నారని.. కానీ ఆ పార్టీ జస్ట్ 5 లేదా 6 సీట్ల కంటే ఎక్కువ గెలవదన్నారు. తెలంగాణలో హెట్ స్పీచ్ బిల్లు తెచ్చి పకడ్బందీగా అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి గతంలో ప్రకటించారని ఎంపీ లక్ష్మణ్ గుర్తు చేశారు. ముస్లింలను రెచ్చగొట్టే వ్యాఖ్యలపై సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది హెట్ స్పీచ్ కాదా? అని సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోదీ ఏం ఆలోచిస్తారో రెండో వ్యక్తికి కూడా తెలియదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితీన్ నబీన్‌ను ఎంపిక చేస్తారని ఎవ్వరూ ఊహించలేదని తెలిపారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ నిలబడడం అంతా ఈజీ కాదని చెప్పారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు ఎవ్వరూ సమాధానం చెప్పడం లేదన్నారు. అయితే కవిత ప్రస్తుతం ప్రస్తావిస్తున్న అంశాలు.. ఆమె బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడే మాట్లాడి ఉంటే బాగుండేదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

# వడ్డీరేట్లలో మార్పుల్లేవ్: ఆర్‌బీఐ




న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థపై గ్లోబల్ పరిస్థితుల ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరోసారి కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం ఈ వివరాలను వెల్లడించారు. మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం ఏప్రిల్ 6, 7, 8 తేదీల్లో జరిగింది. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా సమీక్షించిన తర్వాత కీలక నిర్ణయాన్ని తీసుకున్నట్లు గవర్నర్ తెలిపారు. ఎంపీసీ సభ్యులందరూ ఏకగ్రీవంగా రెపో రేటును 5.25 శాతం వద్ద కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దీనితో పాటు ఇతర వడ్డీ రేట్లను కూడా యథాతథంగా ఉంచినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎన్‌డిఎఫ్) రేటు 5 శాతం వద్ద కొనసాగుతుండగా, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్‌ఎఫ్) రేటు, బ్యాంక్ రేటు 5.5 శాతంగా కొనసాగుతున్నాయి. గతంలో ఫిబ్రవరి నెలలో జరిగిన సమీక్షలో కూడా ఆర్‌బీఐ ఇదే విధమైన నిర్ణయం తీసుకుంది. అయితే, 2025 సంవత్సరంలో పలు దఫాలుగా వడ్డీ రేట్లలో కోతలు పెట్టింది. ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గించిన ఆర్‌బీఐ, జూన్‌లో 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అనంతరం డిసెంబర్‌లో మరో 25 బేసిస్ పాయింట్ల కోత విధించింది. ఈ చర్యలతో మొత్తం మీద గత ఏడాది రెపో రేటు 1.25 శాతం మేర తగ్గింది. ప్రస్తుత నిర్ణయంపై గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. ముఖ్యంగా పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, సరఫరా గొలుసుల్లో అంతరాయాలు గ్లోబల్ వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో చమురు ధరలు పెరుగుతుండటం ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెంచే అవకాశం ఉందని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం సగటున 4.6 శాతం ఉండొచ్చని పేర్కొంది. అయితే, ఈ సవాళ్ల మధ్య కూడా భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉందని ఆర్‌బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. గత సంక్షోభాల కాలంతో పోలిస్తే ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ ఆర్థిక వ్యవస్థ మరింత బలంగా ఉందన్నారు. గ్లోబల్ షాక్స్‌ను తట్టుకునే సామర్థ్యం ఉన్నదని పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధిపై కూడా ఆర్‌బీఐ ఆశాజనక అంచనాలు వ్యక్తం చేసింది. 2026-27లో దేశ జీడీపీ వృద్ధి రేటు 6.9 శాతం వరకు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఇది గ్లోబల్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే మంచి సూచికగా భావిస్తున్నారు. ఇక అంతర్జాతీయ మార్కెట్ల పరిస్థితులపై కూడా ఆర్‌బీఐ దృష్టి సారించింది. గ్లోబల్ అస్థిరతల కారణంగా అమెరికా డాలర్ బలపడుతుండగా, ఇతర దేశాల కరెన్సీలపై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొంది. దీనివల్ల ఆర్థిక మార్కెట్లలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపింది. బంగారం, లోహాల ధరలు కొంత స్థిరంగా ఉన్నప్పటికీ, ఈక్విటీ మార్కెట్లలో ఒడిదుడుకులు కనిపిస్తున్నాయని ఆర్‌బీఐ తెలిపింది. ద్రవ్యోల్బణ భయాలు, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వంపై ఆందోళనలతో ప్రభుత్వ బాండ్ల యీల్డ్స్ పెరుగుతున్నాయని పేర్కొంది. దేశ ఫారెక్స్ నిల్వల విషయానికొస్తే, ఏప్రిల్ 3 నాటికి అవి 696.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది. ఇది దేశ ఆర్థిక స్థితికి బలాన్ని ఇస్తోందని నిపుణులు భావిస్తున్నారు. మొత్తం మీద, గ్లోబల్ అనిశ్చితి పరిస్థితుల్లో ఆర్‌బీఐ జాగ్రత్త వైఖరిని అవలంబిస్తూ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచినట్లు స్పష్టమవుతోంది. పరిస్థితులను దగ్గరగా పరిశీలిస్తూ భవిష్యత్ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు ఆర్థిక వర్గాలు భావిస్తున్నాయి.

## రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో ప్రమాదం



కాగజ్‌నగర్ :భీమ్, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ సమీపంలోని పెద్దవాగు రైల్వే బ్రిడ్జి వద్ద బుధవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రైల్వే మూడో లైన్ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న అండర్ కన్స్ట్రక్షన్ బాక్స్ బ్రిడ్జి పనులు జరుగుతుండగా, ఒక్కసారిగా ప్రమాదం జరిగి ఇద్దరు కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన ఇతర కార్మికులు మరియు స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరిలో ఒకరిని విజయవంతంగా బయటకు తీసి, చికిత్స నిమిత్తం తక్షణమే ఆస్పత్రికి తరలించారు. రెండో కార్మికుడు ఇంకా బ్రిడ్జి కింద భాగంలోనే చిక్కుకుని ఉన్నట్లు తెలుస్తోంది. అతనికి తీవ్ర రక్తస్రావం జరుగుతుండటంతో పరిస్థితి అత్యంత విషమంగా ఉందని క్షేత్రస్థాయి సమాచారం. రైల్వే నెట్‌వర్క్ విస్తరణలో భాగంగా చేపట్టిన ఈ మూడో లైన్ పనుల వద్ద సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాక్స్ బ్రిడ్జి నిర్మాణం సమయంలో మట్టి లేదా కాంక్రీట్ దిమ్మెలు కుంగిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రస్తుతం రైల్వే అధికారులు మరియు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న కార్మికుడిని సురక్షితంగా బయటకు తీసేందుకు గ్యాస్ కట్టర్లు మరియు ఇతర యంత్రాలను ఉపయోగిస్తున్నారు.

## భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబాయి: పశ్చిమ ఆసియా యుద్ధంలో కాల్పుల విరమణ ఒప్పందం కారణంగా దలాల్ స్ట్రీట్ పుంజుకోవడంతో పాటుగా దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు దాదాపు 4% పెరిగి గణనీయంగా లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ సెషన్‌లో పెట్టుబడిదారుల సంపద సుమారు రూ. 17.1 లక్షల కోట్లు పెరగడంతో, మొత్తం బీఎస్‌ఈ మార్కెట్ మూలధనం రూ. 445.8 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 2,946.32 పాయింట్లు లాభపడి 77,562.90 వద్ద ముగియగా, నిఫ్టీ 873.35 పాయింట్లు ఎగబాకి 23,997.35 వద్ద ముగిసింది. మార్కెట్ ముగిసిన తర్వాత, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ 8.22% లాభంతో సెన్సెక్స్ లో అత్యధిక లాభపడిన సంస్థల జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. దీని తర్వాతి స్థానంలో లార్సెన్ అండ్ టూబ్రో లిమిటెడ్ నిలిచి, 7.64% లాభపడింది. బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ 7.03% మేర పురోగతి సాధించగా, మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ 6.60% లాభాన్ని నమోదు చేసింది. యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ కూడా 6.56% లాభంతో సానుకూల ముగింపును నమోదు చేసింది. హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం వల్ల చమురు ధరలు 100 డాలర్ల కంటే తక్కువకు పడిపోయి, ఖీ27 ఈసీఎస్ వృద్ధికి ఉన్న ప్రతికూల ప్రమాదాలు తగ్గాయి. దీనివల్ల భారతదేశానికి తక్షణ ప్రయోజనం చేకూరింది. సెంటిమెంట్‌లో వచ్చిన ఈ గణనీయమైన మెరుగుదల 10 సంవత్సరాల బాండ్ దిగుబడిలో చెప్పుకోదగ్గ తగ్గుదలకు దారితీసి, రూపాయిని బలోపేతం చేసింది. అదే సమయంలో, ఆర్‌బిఐ యథాతథ స్థితి వైఖరి ఫైనాన్షియల్స్‌కు మరింత మద్దతునిచ్చిందని విశ్లేషకులు వెల్లడించారు.

## 'ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'

కట్టంగూర్, : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజులా మాధవరెడ్డి అన్నారు. కట్టంగూర్ మండలంలోని బొల్లెపల్లి, మల్లారం, కల్మెర, మునుకుంటకల, ఈదులూరు, వందనపల్లి నారెగూడెం, పరడ గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఎప్పీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ పుష్పలత, పీఏసీఎస్ సీఈఓ బండ మల్లారెడ్డి, ఏపీఎం రాములు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, ఆయా గ్రామాల సర్పంచులు జలజ, గుల్లి నరేష్, కుంభం అనిల్ రెడ్డి, కురిమిల్ల మల్లేష్, కొలిపాక సురేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గుండు పరమేష్, బండారు కృష్ణ, నాయకులు నంద్యాల వెంకట్ రెడ్డి, గద్దపాటి దానయ్య, మండల సమాఖ్య అధ్యక్షులురాలు అయితగోని ఝాన్సీ, గద్దపాటి రాములు, గడుసు శంకర్ రెడ్డి, ఎర్ర వెంకన్న, కత్తుల శంకర్, అయితగోని నర్సింహ్మా, ఎడ్ల పెద రాములు, అయితగోని నారాయణ, మిట్టపల్లి శివ, రెడ్డిపల్లి స్వామి పాల్గొన్నారు.

## గౌతమ్ అదానీకి ఊరట..

న్యూఢిల్లీ:ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ కి అమెరికా కోర్టులో కీలక ఊరట లభించింది. తమపై యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ నమోదు చేసిన ఫ్రాడ్ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు న్యూయార్క్ లోని ఫెడరల్ కోర్టు అంగీకరించింది. ఈ కేసు అమెరికా చట్టాల పరిధిలోకి రాదని, ఇది పూర్తిగా దేశం వెలుపల జరిగిన వ్యవహారమని అదానీ తరపు న్యాయవాదులు వాదిస్తున్నారు. భారత్‌లో సోలార్ ఎనర్జీ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు భారత అధికారులకు 250 మిలియన్ డాలర్లకు పైగా లంచాలు ఇవ్వజూపారని, ఈ విషయాన్ని అమెరికా పెట్టుబడిదారుల నుంచి దాచిపెట్టి నిధులు సేకరించారని ఆరోపిస్తూ 2024 నవంబర్‌లో ఎస్‌ఈసీ ఈ కేసును దాఖలు చేసింది. ఈ కేసులో గౌతమ్ అదానీతోపాటు ఆయన బంధువు సాగర్ అదానీని కూడా ప్రతివాదిగా చేర్చింది. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ తీవ్రంగా వ్యతిరేకించింది. తమ పిటిషన్‌లో కీలక అంశాలను ప్రస్తావించింది. కేసు పూర్తిగా భారత్‌కు సంబంధించినదని దీనిపై విచారణ జరిపే అధికారం అమెరికా కోర్టులకు లేదని స్పష్టంచేసింది. అదానీ గ్రీన్ ఎనర్జీ 2021లో జారీ చేసిన బాండ్ల అమ్మకం అమెరికా వెలుపల జరిగిందని, ఈ బాండ్ల కాలపరిమితి కూడా ముగిసిందని తెలిపింది. 2024లో అసలు, వడ్డీతో సహా పెట్టుబడిదారులకు పూర్తి సొమ్మును తిరిగి చెల్లించామని, కాబట్టి ఎవరికీ ఆర్థిక నష్టం జరగలేదని కోర్టుకు వివరించింది. ఈ నేపథ్యంలో కేసును ప్రాథమిక దశలోనే కొట్టివేయాలని అదానీ తరఫు న్యాయవాదులు అభ్యర్థించారు. ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. పిటిషన్‌పై విచారణ జరిపేందుకు అంగీకారం తెలిపింది. ఇది అదానీకి తొలి విజయం కాగా.. సుదీర్ఘమైన విచారణ ప్రక్రియను తప్పించుకునేందుకు ఆయనకు ఒక అవకాశం లభించినట్లయ్యింది.

దేశ టైమ్స్

# సంపాదకీయం

## ఒంటరి ప్రయాణాల గురించి సమాచారాన్ని మహిళలు ఇప్పుడు అంతకుముందు కంటే ఎక్కువగా వెతుకుతున్నారు...

ప్రపంచవ్యాప్తంగా ఒంటరిగా ప్రయాణించాలనుకునే మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ ట్రెండ్ వేగంగా పెరుగుతోంది.ఒంటరి ప్రయాణాల గురించి సమాచారాన్ని మహిళలు ఇప్పుడు అంతకుముందు కంటే ఎక్కువగా వెతుకుతున్నారు.గత ఐదేళ్లలో ఇలాంటి సమాచారాన్ని వెతికే మహిళల సంఖ్య బాగా పెరిగింది.మహిళలు ఒంటరి ప్రయాణాలను ప్లాన్ చేస్తున్నారు. కానీ, వారి భద్రతపై ఇప్పటికీ ఆందోళనలు అలానే ఉన్నాయి.2026 ఫిబ్రవరిలో చేపట్టిన సర్వేలో 59 శాతం మంది మహిళలు రాత్రిపూట ఒంటరిగా నడవడం అంత సురక్షితం కాదని భావిస్తున్నట్లు వెల్లడైంది.భద్రతా కారణాల రీత్యా పురుషుల కంటే ఎక్కువగా మహిళలు ప్రయాణాలకు దూరంగా ఉంటున్నారు.ఇలాంటి పరిస్థితిలో.. ఒంటరిగా ప్రయాణించేటప్పుడు ప్రపంచంలో ఏ దేశాలు సురక్షితమో తెలుసుకోవడం మహిళలకు చాలా అవసరం.జార్జ్‌టౌన్ యూనివర్సిటీ ఉమెన్, పీస్ అండ్ సెక్యూరిటీ (డబ్ల్యూపీఎస్) ఇండెక్స్‌ను, గ్లోబల్ పీస్ ఇండెక్స్‌ను బీబీసీ అధ్యయనం చేసింది.అలాగే, ఒంటరిగా ప్రయాణించే కొందరు మహిళలతో మాట్లాడింది.ఇలా మాట్లాడినప్పుడు, ఒంటరిగా మహిళలు ప్రయాణించేటప్పుడు సురక్షితమని భావించదగ్గ అయిదు దేశాలను గుర్తించింది.కోస్టా రికా సెంట్రల్ అమెరికాలో ఉంది. ప్రపంచంలో సంతోషకరమైన దేశాల జాబితా.. డబ్ల్యూపీఎస్ ఇండెక్స్‌లో 34వ స్థానం ఈ దేశానిది.డిజిటల్ నోమాడ్ వీసాతో రిమోట్ వర్కర్లను కోస్టా రికా ఆకర్షిస్తోంది.'రిమోట్ వర్క్ వీసా' అని కూడా దీన్ని పిలుస్తారు. రిమోట్ వర్కర్లు మరో దేశంలో నివసిస్తూనే తమ కంపెనీ లేదా క్లయింట్ల కోసం ఆన్‌లైన్‌లో పనిచేయడానికి చట్టబద్ధంగా ఈ వీసా అనుమతిస్తుంది.'' ఒంటరి మహిళలు అపరిచితులను కలవడానికి ప్రపంచంలోనే అత్యంత సులభమైన ప్రదేశాల్లో కోస్టా రికా ఒకటి'' అని ట్రావెల్ ఏజెంట్ మోలీ గనన్ చెప్పారు.శాంటా థెరెసా, నోసెరా వంటి పట్టణాలలో సర్ఫింగ్, యోగా, బీచ్ వాక్‌లలో తేలికగా ఇతరులతో సంభాషించేందుకు వీలవుతుంది.''బీచ్‌లో లభించే ప్రశాంతత, వాతావరణం నాకు సరికొత్త అనుభూతిని ఇచ్చింది. రోజంతా నేను ఫోటోలు తీసుకుంటూనే ఉన్నా. వర్షం పడినప్పుడు ఒక ప్రశాంతమైన చోట కూర్చుని, స్నాక్స్ తింటూ, స్కెచ్‌లు వేసుకునేదాన్ని'' అని ఈ ప్రాంతాన్ని సందర్శించిన యాష్లే హంటర్ చెప్పారు.డబ్ల్యూపీఎస్ ఇండెక్స్‌లో ఎస్టోనియా 11వ ర్యాంకును పొందింది. ఆ దేశానికి ఇప్పటివరకు లభించిన అత్యుత్తమ ర్యాంకు ఇదే.మహిళల ఆరోగ్యం, ఆర్థిక భాగస్వామ్యం, సామాజిక భద్రత విషయాలలో ఎస్టోనియా అగ్ర స్థానంలో ఉంది. గ్లోబల్ పీస్ ఇండెక్స్‌లో ఎస్టోనియా 24వ స్థానంలో ఉంది.''ఎస్టోనియాలో నాకు ఎప్పుడూ అభద్రత అనిపించలేదు'' అని బ్లాగర్ వెరోనికా రోమానే చెప్పారు.ఎస్టోనియా రాజధాని టాలిన్. ఇక్కడి.. యునెస్కో గుర్తింపు పొందిన ఓల్డ్ టౌన్ ఒంటరి ప్రయాణాలకు సరైన ప్రదేశం.టాలిన్ రాజధాని, యునెస్కో గుర్తింపు పొందిన పాత పట్టణం మహిళలు ఒంటరి ప్రయాణాన్ని ప్రారంభించడానికి సరైన ప్రదేశం.ఇక్కడ గుళకరాళ్లతో వీధులు ఉన్నాయని రోమానే వివరించారు. ఇక్కడున్న చిన్న చిన్న దుకాణాలు సంప్రదాయ వస్తువులను, ఆహారాన్ని అమ్ముతుంటాయని చెప్పారు.''ఎక్కడ చూసిన కనువిందు చేసే కళారూపాలు, టాలిన్ పాత వీధుల చరిత్ర వల్ల.. ఒంటరిగా తిరగడం పూర్తిగా సౌకర్యంగా అనిపించింది'' అని ఆమె వివరించారు.గ్లోబల్ పీస్ ఇండెక్స్‌లో 38వ స్థానంలో ఉన్న వియత్నాం డబ్ల్యూపీఎస్ ఇండెక్స్‌లో తన పొరుగు దేశాల కంటే మెరుగ్గా ఉంది.''ఇక్కడ ప్రతిరోజూ సంభాషణలు చాలా ఆత్మీయంగా ఉంటాయి'' అని గతేడాది ఈ దేశాన్ని సందర్శించిన మోలీ గనన్ చెప్పారు.''కేఫ్ ఓనర్‌తో మాట్లాడినా, స్ట్రీట్ ఫుడ్ వెండర్ వద్ద టేబుల్‌పై కూర్చున్నాలేదా బస్సు ఎక్కినా.. ప్రతి దగ్గరా మీరు తేలికగా కలిసిపోవచ్చు'' అని అన్నారు.''నేను చాలాసార్లు వియత్నాం వెళ్లాను'' అని రచయిత ట్రేసీ స్మిత్ తెలిపారు.''నేను సాపాలో ట్రెక్కింగ్ చేశాను. మెకాంగ్ డెల్టాలోని ఒక హోమ్‌స్టేలో ఉన్నాను. ఒక స్థానిక కుటుంబంతో కలిసి టెట్ (వియత్నాం ప్రజలకు నూతన సంవత్సరం) పండుగను జరుపుకొన్నాను. ప్రతిసారీ, నాకు సురక్షితంగా ఉన్నట్లు, నన్ను అందరూ చాలా ఆప్యాయంగా ఆహ్వానించినట్లు అనిపించింది'' అని చెప్పారు.మీ చెక్‌లిస్ట్‌లోని ప్రదేశాలను సందర్శించడమే కాకుండా... స్థానిక గైడ్‌లతో కోఆర్డినేట్ చేసుకోవడం, హోమ్‌స్టేలలో ఉండటం, నెమ్మదిగా ప్రయాణాన్ని ఆస్వాదించడం వంటివి చేయాలని ట్రేసీ చెబుతున్నారు.డబ్ల్యూపీఎస్ సూచికలో ఈ ఏడాది ఉరుగ్వే పైకి వచ్చింది. గతంలో 59వ స్థానంలో ఉన్న ఈ దేశం ఇప్పుడు 35వ స్థానంలో ఉంది.న్యాయ, భద్రత రంగాలలో ఈ దేశం కనబర్చిన మంచి పనితీరు .. ముఖ్యంగా మహిళలపై హింస రేటు తగ్గడం దీనికి కారణం.గ్లోబల్ పీస్ ఇండెక్స్‌లో దక్షిణ అమెరికా ఖండంలో రెండో అత్యంత ప్రశాంత దేశం ఇది. తొలిస్థానం అర్జెంటీనాది.''ఉరుగ్వే చాలా శాంతియుత దేశం. ప్రజలు చాలా బాగా స్వాగతిస్తారు. పర్యటకులు పెద్దగా లేని సమయంలో నేను మార్చ్‌లో వెళ్లాను. చాలా మంది స్థానికులను కలిశాను, వారు చాలా బాగా మాట్లాడారు. తమ దేశం, చరిత్ర, సంస్కృతి గురించి చెప్పేందుకు వారు సిద్ధంగా ఉన్నారు'' అని క్లాడియా తవాని తన బ్లాగ్‌లో రాశారు.ఉరుగ్వే నైరుతి ప్రాంతంలోని కొలోనియా డెల్ సాక్రమెంటో సందర్శించేందుకు ఒక గొప్ప ప్రదేశం. బారియో హిస్టోరికో మాదిరిగానే, దేశంలో అత్యంత ఎక్కువ మంది సందర్శించే అనేక ఆకర్షణలకు ఇది నిలయమైంది.''గులకరాళ్ల వీధులు, సున్నం పూసిన గోడలు, వీధులకు ఇరువైపులా రంగురంగుల పువ్వులతో ఒక చిట్టడవిలా ఉంటుంది'' అని ఆ ప్రాంతం గురించి తవాని వివరించారు.''అక్కడి పాతకాలపు కార్లు దీనిని మరింత ప్రత్యేకంగా చేస్తాయి'' అని అన్నారు.డబ్ల్యూపీఎస్ ఇండెక్స్‌లో నార్వే మూడో స్థానంలో ఉంది. సంక్షేమ కార్యక్రమాలు, సమాన వేతనం, సామాజిక భద్రత వంటి రంగాలలో మంచి పనితీరు కనబరుస్తుంది.2017 నుంచి ఇది తరచూ టాప్ 3లో ఉంటోంది. దీని బలమైన సామాజిక భద్రత వ్యవస్థ మహిళలు పనిచేయడానికి, ప్రభుత్వంలో చురుగ్గా పాల్గొనడానికి వీలు కల్పిస్తుంది.ఒంటరిగా ప్రయాణించే మహిళలకు ఈ ప్రదేశం వల్ల కలిగే అతిపెద్ద ప్రయోజనం ఏంటంటే... భద్రత, ప్రకృతికి సంబంధించిన అందమైన దృశ్యాలు.''ఇక్కడ ఒంటరిగా ప్రయాణించడం చాలా తేలిక'' అని ట్రావెలర్ జానిస్ లింట్జ్ చెప్పారు. ''నా క్రూయిజ్ ప్రయాణం చాలా అద్భుతమైన అనుభవాల్లో ఒకటి'' అని తెలిపారు.''రాత్రిపూట ఆకాశాన్ని ఫోటోలు తీయడానికి బయటకు వెళ్లినప్పుడు కూడా నార్వేలో నాకు సురక్షితంగా అనిపించింది'' అని ది వాండరింగ్ లెన్స్ ట్రావెల్ ఫోటోగ్రఫీ క్లబ్ వ్యవస్థాపకురాలు లీసా మిషెల్ బర్న్స్ చెప్పారు.తను రెండుసార్లు ఒంటరిగా నార్వేను సందర్శించారు. అక్కడున్న సౌకర్యవంతమైన హోటళ్లు కూడా బర్న్స్‌కు నచ్చాయి.''రోర్‌బుయే (క్యాబిన్లుగా మార్చిన పాత ఇళ్లు), స్కాండినేవియన్ ఇంటీరియర్ డిజైన్‌ను చాలా ఇష్టపడటంతో.. నేనెప్పుడూ నార్వే తిరిగి వెళ్లాలనుకుంటాను'' అని చెప్పారు.

## విద్యార్థుల హెల్త్‌కార్డు రూపొందించాలి

ఖమ్మం : ప్రతి విద్యార్థికి సంబంధించిన హెల్త్‌కార్డును రూపొందించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఖమ్మంరూరల్ కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, పరిసరాల్లో తిరుగుతూ మౌలిక సదుపాయాలు, వంటగది, స్టోర్‌రూం, ఇతర నిత్యావసర సరుకులు బియ్యం, కూరగాయలు, రిజిస్టార్స్ తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు.పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా చర్యలు చేపట్టాలని, ప్రహరీ, డైనింగ్‌హాల్ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతివారం తమ పరిధిలో ఉన్న కేజీబీవీ, గురుకులం, ప్రభుత్వ విద్యాసంస్థలను అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లలు, బీఆర్ఎస్‌కే ద్వార వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్‌కార్డు ప్రొఫైల్ తయారు చేయాలన్నారు. గురుకులాల్లో ఉన్న విద్యార్థులకు ఆరోగ్యవంతమైన, రుచికరమైన ఆహారం అందించాలన్నారు.వంటగది శుభ్రత, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు ఉన్నతమైన విద్యనందిస్తూ పదో తరగతి పరీక్షలో వందశాతం ఫలితాలు వచ్చే విధంగా చొరవ చూపాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ రూబీ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఆయేషాబేగం, విద్యా, మున్సిపల్, రెవెన్యూశాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు విధిగా పాటించాలి

ఖమ్మం : ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించేందుకు ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు విధిగా పాటించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డేని ఘనంగా నిర్వహించారు. తొలుత అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆహార భద్రత ప్రమాణాల గురించి ప్రజలు, ఫుడ్ వ్యాపారుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. నిరంతరం ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ర్యాలీ పటేల్ స్టేడియం నుంచి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ డీ రామారావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ కేసగాని రాజశేఖర్‌గౌడ్, డీవైఎస్‌వో తుంబూరు సునీల్‌రెడ్డి, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ జడ్ఎస్ జయపాల్, బిట్టా ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఈసీ విషయంలో విపక్షాలకు బిగ్ షాక్..!

న్యూఢిల్లీ:ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని విపక్షాలు చేసిన ప్రయత్నాలకు పెద్ద దెబ్బ తగిలింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఇరు సభల్లో ప్రవేశపెట్టిన తీర్మానాలను తిరస్కరించారు. ఈ తీర్మానాలను ఆమోదించడానికి తగిన, పటిష్టమైన ఆధారాలు లేవని ప్రిసైడింగ్ అధికారులు స్పష్టం చేశారు.మార్చి 12న లోక్‌సభలో 130 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ముఖ్య ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానాన్ని ఇచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5), ఆర్టికల్ 124(4)లను ఉటంకిస్తూ న్యాయమూర్తుల విచారణ చట్టం 1968 ప్రకారం విచారణ ప్రక్రియను ప్రారంభించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి.లోక్‌సభ స్పీకర్ తీర్మానంపై సుదీర్ఘంగా ఆలోచించిన అనంతరం సమర్పించిన ఆరోపణలు, సాక్ష్యాలు అభిశంసన వంటి తీవ్రమైన రాజ్యాంగ ప్రక్రియను ప్రారంభించేంత పటిష్టంగా లేవని పేర్కొన్నారు. తన చట్టబద్ధమైన అధికారాలను ఉపయోగించి ఆయన ఈ తీర్మానాన్ని ఆమోదించడానికి నిరాకరించారు. అదేవిధంగా రాజ్యసభ ఛైర్మన్ కూడా 63 మంది సభ్యులు సమర్పించిన తీర్మానాన్ని లోతుగా సమీక్షించారు. అన్ని చట్టపరమైన, రాజ్యాంగపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఆయన కూడా దానిని తిరస్కరించారు.ఇరు సభల్లోనూ తీర్మానాలు తిరస్కరణకు గురికావడంతో ఈ అంశంపై కొనసాగుతున్న రాజకీయ పోరాటానికి ప్రస్తుతానికి తెరపడింది. అధికార పక్షం దీనిని రాజ్యాంగ సంస్థల గౌరవానికి దక్కిన విజయంగా అభివర్ణిస్తుండగా, విపక్షాలు దీనిని జవాబుదారీతనం నుండి తప్పించుకునే ప్రయత్నంగా పేర్కొంటున్నాయి. ఏదేమైనా రాబోయే రోజుల్లో ఈ అంశం మళ్లీ చట్టపరమైన, రాజ్యాంగపరమైన చర్చలకు కేంద్రబిందువుగా మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## ప్రతిధాన్యపు గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది



తుంగతుర్తి, : కొనుగోలు కేంద్రాల్లోకి తీసుకువచ్చిన ప్రతి ధాన్యపు గింజలు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే మందుల సామెల్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డును అందించలేదని విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయన్నారు.రైతులు గిట్టుబాటు ధర పొందాలంటే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం అందించే ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2389, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2369 మద్దతు ధర పొందాలని అన్నారు. నియోజకవర్గ పరిధిలో 20040 మంది సీఎంఆర్ చెక్కుల గాను సుమారు 80 లక్షల పైచిలుకు చెక్కులను పంపిణీ చేశారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా త్వరలోనే ఎస్ఆర్ఎస్పి జలాలను సంబంధిత మంత్రితో ఫోన్లో మాట్లాడి విడుదలకు కృషి చేస్తానన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, తాహసిల్దార్ దయానందం, ఎంపీడీవో శేష్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడిఏ రమేష్ బాబు, కోపరేటివ్ సీనియర్ ఇన్స్పెక్టర్ ఎస్ కే బడే సాబ్, సొసైటీ సీఈవో యాదగిరి,తుంగతుర్తి సింగిల్ విండో మాజీ చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, తుంగతుర్తి,మద్దిరాల, నూతనకల్, నాగారం, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దొంగరి గోవర్ధన్, జిల్లా నాయకులు రేగటి రవి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బికోజి,తుంగతుర్తి పట్టణ అధ్యక్షుడు ఉప్పుల రాంబాబు యాదవ్, పచ్చిపాల సుమతి, దాయం ఝాన్సీ రాజిరెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, , తదితరులు పాల్గొన్నారు.

## ఎలుకలు , బుద్దికలు తిన్న ఆహారాన్ని సప్లై చేస్తున్న హోటల్స్




హైద్రాబాద్: హైదరాబాద్‌లోని హోటళ్లలో ఆహార నాణ్యత ఏ స్థాయిలో ఉందో మరోసారి బయటపడింది. బంజారాహిల్స్‌లోని 'లక్కీ బిర్యానీ షవర్మ' ఉదంతం నగరవాసులను ఉలిక్కిపడేలా చేసింది. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్-2లో ఉన్న 'లక్కీ బిర్యానీ షవర్మ' హోటల్ అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వెంకటరమణ కాలనీకి చెందిన కొండారెడ్డి అనే వినియోగదారుడు ఆదివారం జొమాటో ద్వారా చికెన్ బిర్యానీ ఆర్డర్ చేయగా, అది తీవ్రమైన దుర్వాసనతో కూడి ఉంది. ఆహారం పాడైపోయిందని గ్రహించిన ఆయన వెంటనే పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు హోటల్‌పై ఆకస్మిక దాడి చేయగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. హోటల్ యజమాని ఇర్ఫాన్ కేవలం లాభాపేక్షతో వినియోగదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు అధికారులు గుర్తించారు.పోలీసుల తనిఖీల్లో వెల్లడైన విషయాలు చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది. జీడిమెట్లలో మూడు రోజుల క్రితమే తయారు చేసిన సుమారు 80 బిర్యానీ ప్యాకెట్లను తీసుకువచ్చి ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచుతున్నారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ రాగానే వాటిని ఓవెన్‌లో వేడి చేసి, తాజాగా ఉన్నట్లు నమ్మించి కస్టమర్లకు పంపిస్తున్నారు. మరీ దారుణమైన విషయం ఏమిటంటే, ఆ బిర్యానీ ప్యాకెట్లు ఉంచిన ఫ్రిడ్జ్‌లో ఎలుకలు స్వేచ్ఛగా తిరుగుతూ కనిపించాయి. హోటల్ కిచెన్ అంతా బొద్దింకలు, చెత్తాచెదారం మరియు దుర్వాసనతో అపరిశుభ్రంగా ఉంది. ఎలుకలు, బొద్దింకలు తిన్న ఆహారాన్నే ప్రజలకు వడ్డిస్తూ హోటల్ యాజమాన్యం బరితెగించింది.ఈ భయంకరమైన పరిస్థితులను చూసిన పోలీసులు వెంటనే హోటల్‌ను సీజ్ చేశారు. సమాచారం అందుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని ఆహార నమూనాలను సేకరించారు. ప్రజల ఆరోగ్యానికి విఘాతం కలిగిస్తున్న యజమాని ఇర్ఫాన్‌పై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆన్‌లైన్ యాప్స్ ద్వారా ఆహారాన్ని ఆర్డర్ చేసే వారు, కేవలం రేటింగ్స్ చూసి మోసపోకుండా హోటళ్ల నాణ్యతపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి బాధ్యతారహితమైన హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## వాట్సాప్‌లో తెలంగాణ సర్కార్ సేవలు




హైద్రాబాద్: తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ సేవల వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఒక్క క్లిక్‌తో ప్రభుత్వ సేవలను మన అరచేతిలోకే తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతోంది. మీ-సేవ, ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ తిరిగే అవకాశం లేకుండా సెల్‌ఫోన్‌లోనే చూసుకునేలా ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ పాలనను ప్రజల చేతిలోకి తీసుకువచ్చేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మీ-సేవ ద్వారా అందే సేవలు, ఇంటర్, పదో పరీక్షల హాల్ టికెట్లను వాట్సాప్‌లో అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వం ప్రభుత్వ సేవలను కూడా డిజిటల్‌గా అందుబాటులోకి తెస్తోంది.ఒక్కొక్కటిగా వివిధ శాఖల సేవలను కూడా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్‌తో లింక్ చేస్తోంది. ఇలా చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్రతీ సేవకు సంబంధించిన లింక్ ఒక్క వాట్సాప్ మెసేజ్‌తో అరచేతిలోకి రానుంది. అదే సమయంలో భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి ఉద్యోగ పరీక్షలకు సంబంధించిన రిక్రూట్‌మెంట్ బోర్డులు కూడా ఈ వాట్సాప్‌నే వినియోగించేలా ప్రణాళికలు కూడా జరుగుతున్నాయి. ఇక ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్ అయి వాట్సాప్‌లో అందుబాటులోకి వస్తే ఇంటర్నెట్ సెంటర్లు, మీ-సేవ సెంటర్ల చుట్టూ తిరిగే పని లేకుండా కేవలం వాట్సాప్ ద్వారా ప్రజలకు సేవలు అందుతాయని అధికారులు పేర్కొంటున్నారు.ఈ వాట్సాప్ సేవల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 80969 58096 అనే నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో వేర్వేరు డిపార్ట్‌మెంట్‌లకు వేర్వేరుగా ఉన్న పోర్టల్‌లతో తీవ్ర గందరగోళం ఏర్పడగా, దానికి స్వస్తి పలుకుతూ ఈ ఇంటిగ్రేటెడ్ విధానాన్ని తీసుకువచ్చి అన్ని సేవలకు ఒకే వాట్సాప్ నంబర్‌ను తీసుకువచ్చారు. ప్రజల ఫిర్యాదుల దగ్గరి నుంచి సర్టిఫికెట్ల జారీ వరకు అన్నింటినీ ఒకే దగ్గరికి చేర్చే విప్లవాత్మక మార్పులు చేస్తున్నారు. ఇది కేవలం సమాచారం కోసమే కాకుండా నేరుగా సేవలు పొందే వేదికగా మార్చారు.ఇటీవల పలు ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన హాల్ టికెట్లను కూడా వాట్సాప్‌లో అందుబాటులో ఉంచారు. కేవలం రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ, పేరు వంటి వివరాలు ఎంటర్ చేయగానే హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. రానున్న రోజుల్లో స్టేట్ లెవల్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను కూడా వాట్సాప్‌లోనే అందించనున్నారు. ఫలితాలు కూడా తెలుసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. ప్రభుత్వ మెసేజ్‌లు, అలర్ట్‌లు కూడా ఇదే వాట్సాప్ నంబర్ ద్వారా ప్రజలకు చేరనున్నాయి.ప్రస్తుతం మీ-సేవ పోర్టల్‌లో లభించే దాదాపు అన్ని సేవలు వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయి. కులం, ఆదాయం వంటి సర్టిఫికెట్లు, వాటి స్టేటస్ తెలుసుకోవడం దగ్గర నుంచి మున్సిపల్ ట్యాక్స్‌ల చెల్లింపు వరకు వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయి. రెవెన్యూ, విద్యుత్, పౌరసరఫరాల వంటి కీలక శాఖల సమాచారం కూడా అరచేతిలోకి తెచ్చారు. హాయ్ అని ఒక్క మెసేజ్ చేస్తే చాలు, ఆప్షన్లతో కూడిన మెనూ ప్రత్యక్షమవుతుంది.రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నింటినీ ఈ వాట్సాప్ చాట్‌బాట్‌కు లింక్ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి వంటి పథకాలకు దరఖాస్తు చేసుకోవడం, అర్హతలు చెక్ చేసుకోవడం, రేషన్ కార్డులు, పెన్షన్ల జారీ మరింత సులభం కానుంది. లబ్ధిదారుల అకౌంట్లలో ప్రభుత్వం వేసే డబ్బుల సమాచారం కూడా వాట్సాప్ మెసేజ్‌లో అందించనున్నారు. ఒకే నంబర్‌తో రాష్ట్ర ప్రజలందరికీ అన్ని ప్రభుత్వ సేవలు అందేలా వన్ స్టాప్ షాప్ విధానాన్ని తీసుకురానున్నారు.

# ఆమిర్ ప్లాన్ వర్కవుట్ అవుతుందా?



పదేళ్ల ముందు 'దంగల్' మూవీతో ఇండస్ట్రీ హిట్ ఇచ్చాడు బాలీవుడ్ సూపర్ స్టార్. ఇప్పటికీ ఇండియాస్ హైయెస్ట్ గ్రాసింగ్ మూవీ అదే. అలాంటి హీరో తర్వాతి రెండు చిత్రాలతో దారుణమైన పరాజయాలను అందుకున్నాడు. 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్'తో పాటు 'లాల్ సింగ్ చడ్డా' ఊహించని డిజాస్టర్లు అయ్యాయి. ముఖ్యంగా 'లాల్ సింగ్ చడ్డా' అనుభవం ఆమిర్ ఖాన్‌ను షాక్‌కు గురి చేసింది.దీంతో కెరీర్లో కొంచెం గ్యాప్ తీసుకుని 'సితారే జమీన్ పర్' సినిమా చేశాడు ఆమిర్. ఈ చిత్రం కూడా విడుదలకు ముందు నెగెటివిటీ ఎదుర్కొంది. కానీ ఆమిర్ కొంచెం స్ట్రాటజిగ్గా వ్యవహరించి ఈ సినిమాతో సత్ఫలితం రాబట్టాడు. టాక్ కొంచెం డివైడ్‌గా ఉన్నప్పటికీ ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లే రాబట్టింది. పరిమిత బడ్జెట్లో తెరకెక్కిన ఈ సినిమాకు థియేటర్ దగ్గరే పెట్టుబడి దాదాపుగా రికవర్ అయిపోయింది.ఆ తర్వాత ఆమిర్ ఈ సినిమాను డిజిటల్ స్ట్రీమింగ్‌కు ఇవ్వలేదు. మొదట్నుంచి ఓటీటీల పట్ల వ్యతిరేకత చూపిస్తున్న ఆమిర్.. ఈ చిత్రాన్ని ఎనిమిది వారాల విండో తర్వాత నేరుగా యూట్యూబ్‌లో రిలీజ్ చేశాడు. అక్కడ కూడా రెంట్ పద్ధతిలోనే సినిమాను వీక్షించే అవకాశమిచ్చాడు. దీన్నుంచి ఆమిర్ మంచి ఆదాయం రాబట్టుకున్నాడు.ఇలా ఆరు నెలల పాటు యూట్యూబ్‌లో ఉంచిన సినిమాను ఇప్పుడు సోనీ లివ్ ద్వారా డిజిటల్ స్ట్రీమింగ్‌కు తీసుకొస్తున్నాడట ఆమిర్. ఇప్పుడు సోనీ లివ్ సబ్‌స్క్రిప్షన్ ఉన్న వాళ్లు ఉచితంగా ఆమిర్ మూవీని చూడొచ్చు.లేటుగా స్ట్రీమింగ్‌కు ఇవ్వడం వల్ల రేటు తగ్గొచ్చు. కానీ ఇప్పటికే యూట్యూబ్ ద్వారా ఆమిర్ మంచి లాభాలు అందుకున్నాడు. ఇప్పుడు సోనీ లివ్ ద్వారా వచ్చే ఆదాయం అదనపు లాభం అన్నమాట. మొత్తంగా ఆయనీ సినిమాతో భారీ లాభమే అందుకున్నాడన్నది బాలీవుడ్ వర్గాల టాక్. స్పానిష్ మూవీ 'ఛాంపియన్స్' ఆధారంగా ఆర్.ఎస్.ప్రసన్న రూపొందించిన ఈ చిత్రాన్ని ఆమిర్ తన సొంత బేనర్లో ప్రొడ్యూస్ చేశాడు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చిట్యాల, : రైతు సంక్షేమమే ధ్యేయమని ప్రభుత్వ విప్, నకరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం అన్నారు. చిట్యాల పట్టణం, వట్టిమర్తి, వనిపాకల, ఆరెగూడెం, పెద్దకాపర్తి, వెలిమినేడు, సుంకెనపల్లి, గుండ్రాం పల్లి గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం మద్దతు ధరతో పాటు సకాలంలో ధాన్యం కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సీఎం రేవంత్ రెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చిన వారు కనుక రైతుల బాధలు తెలిసిన వ్యక్తి అన్నారు. రైతులకు పండించిన పంటకు బోనస్, రుణమాఫీ, రైతు భరోసా అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత ప్రభుత్వం విచ్చిన్నం చేసిన, రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్, ఎఎంసి చైర్మన్ నర్ర వినోద మోహన్ రెడ్డి, సర్పంచులు కాటం వెంకటేశం, ఆవుల సునీత యాదయ్య, ఆవుల సుందర్, బొంతల చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల దేవదాస్, మాజీ సర్పంచ్ జనగాం రవీందర్ గౌడ్, వ్యవసాయ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డదారుల్లో ధాన్యం తరలిస్తే కఠిన చర్యలు



సూర్యాపేట, : అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించేది లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర సరిహద్దుల్లో ధాన్యం ఎగుమతులు, దిగుమతులపై కట్టుదిట్టమైన నిఘా ఉంచామని స్పష్టం చేశారు. ఈ రబీ సీజన్‌లో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉందని తెలిపారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు తమ ప్రభుత్వం సన్నద్ధమైందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అందుబాటులో 16 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయని తెలిపారు.అంతకుముందు హుజూర్ నగర్ రామస్వామి గట్టు సమీపంలో ఐటీ కాలేజీతో పాటు మోడల్ కాలనీ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో 116 ఎకరాల్లో నిర్మిస్తున్న 2,160 సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల మోడల్ కాలనీ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తాయని చెప్పుకొచ్చారు. కాలనీ నిర్మాణానికి రూ.125 కోట్లు ఖర్చు, అదనంగా రూ.20 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ఎలాంటి పైరవీలకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. మొదటి విడతలో 1500 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నెలాఖరులో మోడల్ కాలనీ ప్రారంభోత్సవం జరుగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# అవును... కళ్యాణ్ రామ్ సరసన ఆమెనే



అనిల్ రావిపూడి సినిమాలో ఛాన్స్ అంటే తెలుగులో అంతకుమించిన బంపరాఫర్ లేదన్నట్లే. హిట్ మెషీన్‌గా పేరు తెచ్చుకున్న అనిల్.. ఇప్పటిదాకా అపజయం అన్నదే లేకుండా సాగిపోతున్నాడు. ఒక్క 'ఎఫ్-3' మాత్రమే ఓ మోస్తరు ఫలితంతో సరిపెట్టుకుంది కానీ.. ఇప్పటిదాకా అనిల్ తీసిన మిగతా సినిమాలన్నీ హిట్లు, సూపర్ హిట్లు, బ్లాక్‌బస్టర్లే. ఆయన సినిమాలో నటిస్తే ఒక సక్సెస్ జమ అయినట్లే.అందులోనూ చాలా ఏళ్లుగా హిట్ అన్నదే లేక ఇబ్బంది పడుతున్న ఆర్టిస్టులకు అనిల్ ఛాన్స్ ఇస్తే వాళ్ల ఆనందానికి అవధులు ఉండవు. ఇప్పుడు కన్నడ భామ కృతి శెట్టి ఇదే ఆనందంలో ఉంది. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కలయికలో అనిల్ తీయబోతున్న కొత్త సినిమాలో కృతిని ఒక కథానాయికగా ఎంచుకున్నట్లు ఇంతకుముందే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడా విషయం అధికారికం అయింది.కృతి కథానాయికగా నటించిన తమిళ చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' తెలుగు ప్రి రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా వచ్చిన అనిల్.. తన తర్వాతి చిత్రంలో కృతి నటించనున్న విషయాన్ని ధ్రువీకరించాడు. ప్రచారంలో ఉన్నట్లే కళ్యాణ్ రామ్‌కు జోడీగా కృతి కనిపించనున్నట్లు కూడా అనిల్ వెల్లడించాడు. దీంతో ఇక ఈ చిత్రంలో వెంకీ సరసన ఎవరన్నదే తేలాల్సి ఉంది. ఈ పాత్రకు కీర్తి సురేష్ పేరు వినిపిస్తున్న సంగతి తెలిసిందే.తెలుగులో 'ఉప్పెన' లాంటి బ్లాక్ బస్టర్ మూవీతో కథానాయికగా పరిచయం అయి.. ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు లాంటి సక్సెస్ ఫుల్ చిత్రాల్లో నటించిన కృతికి.. ఆపై వరుసగా ఫ్లాపులే ఎదురయ్యాయి. ఆమె ఫ్లాపుల పరంపర ఇప్పటికే అరడజనుకు చేరుకుంది.'ఎల్ఐకే' అయినా హిట్ అందిస్తుందేమో అని ఆమె ఎదురు చూస్తోంది. వరుసగా రెండు సంక్రాంతి పండుగలకు 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రాలతో భారీ విజయాలందుకున్న అనిల్.. ఇప్పుడు తీయబోయే సినిమాతో మరోసారి సంక్రాంతినే టార్గెట్ చేయబోతున్నాడు.

# పేద ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

వేములవాడ : పేద ప్రజ ల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని విప్, వేములవాడ ఎమ్మె ల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూరల్ మండలంలో 40, వేముల వాడ పట్టణ, అర్బన్ మండలాలలోని 126మంది లబ్ధిదారు లకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్ర మంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ఇందిరమ్మ బీమా పథకం అమలు చేస్తా మన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కోటి 15లక్షల మంది రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు త్వరలో 5లక్షల జీవిత బీమా కల్పించనున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యా విధానంలో పెను మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నారన్నారు. పేద ప్రజల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నెరవేరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్‌చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్, రూరల్ మండల అధ్యక్షుడు వకులా భరణం శ్రీనివాస్, అర్బన్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# మహిళా అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రాజాపూర్,: మహిళల అభివృద్ధి సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. రాజాపూర్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 42 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద మరియు మధ్య తరగతి కుటుంబాల ఆడపిల్ల పెళ్లిళ్లకు ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఎంతో ప్రయోజనం చేకూరుతుంది అని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే అర్హులైన పేదలకు ప్రభుత్వ ఫలాలు అందుతున్నయని అన్నారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని, ఎవరూ మధ్యవర్తుల మాటలు నమ్మకూడదని సూచించారు. ప్రజలకు మరింత సేవ చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో తాసిల్దార్ రాధాకృష్ణ, డిప్యూటీ తాసిల్దార్ భారతి,మండల సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్ గౌడ్,పీ. యాదయ్య,శ్రీనివాస్ నాయక్, సుజాయ్ చంద్రారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, నాసిర్ బేగ్, శ్రీకాంత్ రెడ్డి, విజయ్, శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదు

మెదక్ : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హవేలీ ఘనాపూర్ మండలంలోని సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశీలించారు. పలు ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ. Together for Health -- Stand With Science అనే థీమ్‌ను ప్రస్తావిస్తూ, ప్రజలు శాస్త్రీయ దృక్పథంతో ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధుల లేమి మాత్రమే కాకుండా శారీరక, మానసిక, సామాజిక సంక్షేమం కలగలిపిన సమగ్ర స్థితి అని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో సమతుల ఆహారం తీసుకోవడం, నియమిత వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లను తప్పనిసరిగా అలవరచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించి, మిల్లెట్ ఆహారం, పండ్లు, కూరగాయలు అధికంగా తీసుకోవాలని పేర్కొన్నారు.అలాగే మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా పరిగణించాల్సిన అవసరం ఉందని, ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం వంటి పద్ధతులను అనుసరించాలని తెలిపారు.సీజనల్ వ్యాధులు, జీవనశైలి సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని, ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రతీ కుటుంబం ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సింధు రేణుక ఎంపీవో కృష్ణవేణి, డా. వినయ్ సుశీల్, సర్పంచ్ , అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# దేశభద్రతలో ఐఐఎస్ అధికారుల పాత్ర కీలకం

హైదరాబాద్,: దేశ భద్రత, సంక్షోభ సమయాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ గందరగోళం సృష్టించే శక్తులను, కుట్రలను తిప్పికొట్టేందు కు సమయోచిత, వాస్తవిక, బాధ్యతాయుతమైన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం లో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) అధికారుల పాత్ర చాలా కీలకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభిప్రాయం వ్యక్తంచేశారు.ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ 2009, 2023, 2024 బ్యాచ్‌లకు చెందిన గ్రూప్ ఏ ట్రైనీ అధికారులు ఈ నెల 15 నుంచి 22 వరకు అంతర్గత భద్రత, సంక్షోభ, విపత్తు కమ్యూనికేషన్, సైకాలజికల్ ఆపరేషన్స్‌పై అవగా హన పెంపొందించుకునేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ట్రైనీ అధికారులు మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షే మ పథకాలు పూర్తి స్థాయిలో క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయా? లేదా? అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాలంటే ఏం చేస్తే బాగుంటుందనే అంశాలపైనా కేంద్రమంత్రి ఆరా తీశారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వేగంగా మారుతున్న సమాచార ప్రపంచంలో సమర్థవంతమైన కమ్యూ నికేషన్ పరిపాలనా సాధనం మాత్రమే కాదని, జాతీయ స్థిరత్వానికి, ప్రజల విశ్వాసానికి మూలస్తంభమని చెప్పారు. దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన విషయానికొ స్తే.. మీడియా, సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదారి పట్టించే ఫేక్ సమాచారం సవాల్ విసురుతున్ననేటి తరుణంలో వాటి ని అధిగమిస్తూ ప్రజలను చైతన్యం చేసేందుకు ఏం చేయాలనే దానిపై ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్స్, సెంట్రల్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్ అందించే ప్రత్యేక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అంద్ర వంశీ, కేంద్ర హోంశాఖ మీడి యా విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ రాజ్ కుమార్, ఐఐఎస్ విభాగం కోర్సు డైరెక్టర్ రష్మీ రోజా తుషార నాయర్ తదితరులు పాల్గొన్నారు.

# సాయిల్ హెల్త్ వాలంటీర్లుగా 30 వేల మందికి శిక్షణ



హైదరాబాద్:రాష్ట్రంలోని 30 వేల మంది యువ రైతులకు సాయిల్ హెల్త్ వాలంటీర్లుగా శిక్షణ ఇవ్వనున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని బీఆర్.అంబేడ్కర్ సచివాలయం నుంచి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇద్దరు లేదా ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో భూసార పరీక్షలు, పంటలకనుగుణంగా ఎరువుల వినియోగం వంటి అంశాలపై వాలంటీర్లకు నెల రోజుల పాటు శిక్షణ అందిస్తామని తెలిపారు. ప్రయివేట్ భాగస్వామ్యంతో క్లస్టర్ స్థాయిలో ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. శిక్షణ పొందిన వాలంటీర్లు గ్రామ స్థాయిలో రైతులకు భూసార పరీక్షలకు సహకరించడంతో పాటు, వాటి ఫలితాల ఆధారంగా పంటల ఎంపిక, ఎరువుల వినియోగంపై సలహాలు అందిస్తారని పేర్కొన్నారు. దీనివల్ల శాస్త్రీయంగా ఎరువుల వినియోగం, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని తుమ్మల తెలిపారు. ఈ సందర్భంగా యూరియా యాప్‌పై రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యూరియా యాప్‌తో లైన్లలో నిలబడే బాధ తప్పిందని పలువురు రైతులు తెలిపారు. ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకుని, ఉచిత సమయంలో తెచ్చుకునేందుకు వీలు కలిగిందన్నారు. రైతుల అభిప్రాయాల మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని రైతులకు ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. పామాయిల్ పంటకు మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులు ఆదిశగా ఆలోచించాలని తుమ్మల కోరారు. పామాయిల్ పంటలో అంతర్‌పంటగా వరి, పత్తి, మొక్కజొన్న లాంటివి సాగు చేసుకోవచ్చని వివరించారు.హుజురాబాద్‌లో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ ఏర్పాటును విరమించుకోవాలని మంత్రి తుమ్మలకు హుజురాబాద్ మున్సిపల్ పాలక వర్గం విజ్ఞప్తి చేసింది. మంగళవారం హుజురాబాద్ మున్సిపల్ చైర్మెన్, కౌన్సిలర్లతో పాటు నియోజకవర్గంలోని పలువురు సర్పంచ్‌లు మంత్రిని కలిసి డంప్ యార్డ్ ఏర్పాటు వల్ల ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు.

# సైనికులే కాదు.. గూఢచారులూ త్యాగధనులే



హైదరాబాద్,): దేశాన్ని రక్షించడంలో సరిహద్దుల్లో ఉండి పోరాడే సైనికులే కాకుండా, గూఢచారులు కూడా ఎంతటి త్యాగాలు చేస్తారో అనేది ధురంధర్ సినిమా ఎంతో స్పష్టంగా ప్రతిబింబించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు పేర్కొన్నారు. తమ కుటుంబాలను, వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి, దేశ భద్రత కోసం అనేక కష్టాలను ఎదుర్కొంటున్న గూఢచారుల నిజ జీవితాన్ని ఈ సినిమా కళ్లకు కట్టినట్లు తెలియజేస్తుందన్నారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని ఓ థియేటర్‌లో రాంచందర్‌రావు, బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యద ర్శితోపాటు మరికొంత మంది నాయకులతో కలిసి సినిమా చూశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యంగా కాలేజీ యువత ఈ చిత్రాన్ని తప్పకుండా చూడాలని కోరారు. దేశభక్తి, బాధ్యత వంటి విలువలను పెంపొందించేందుకు ఈ సిని మా అత్యంత ఉపయోగకరంగా నిలుస్తుందని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచంలోని అనే క దేశాల్లో భారత గూఢచారులు దేశ సమగ్రత, భద్రత కోసం పనిచేస్తూ, శత్రుదేశాల కుట్రలను వెలికితీసే విధంగా సేవలు అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా దేశభక్తి మాత్రమే కాదు, దేశ రక్షణపై బాధ్యతను కూడా పెంపొంది స్తుందన్నారు. ప్రత్యే కంగా, ఈ చిత్రంలో డీమానిటైజేషన్ వెనుక ఉన్న కారణాలను స్పష్టంగా వివరించడమే కాకుండా, అప్పటి నిర్ణయం ఎంత సరైనదో మళ్లీ నిరూపించిందన్నారు. పాకిస్థాన్ నుంచి భారీస్థాయిలో నకిలీ నోట్లను పంపించి భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలనే కుట్రలను, అలాగే చిన్నపిల్లలను దుర్వినియోగం చేస్తూ దేశంలో అశాంతిని సృష్టిం చాలనే ప్రయత్నాలను ఈ సినిమా బలంగా ప్రతిబింబించిందని చెప్పారు. దేశంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేందుకు జరిగిన ప్రయత్నాలను కూడా ఈ చిత్రం నిజాయితీగా చూపించిందని, ఈ చిత్ర బృందాన్ని తాను హృదయపూర్వకంగా అభినందిస్తున్నట్టు తెలిపారు. సినిమా చూసిన వారిలో బీజేపీ నాయకులు గౌతంరావు, వీరేందర్‌గౌడ్, బండ కార్తీకరెడ్డి, ముఖ్యఅధికార ప్రతి నిధి ఎన్వీ సుభాష్ తదితరులున్నారు.

# ఎయిర్‌పోర్టు రేంజ్‌లో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్



హైద్రాబాద్: హైదరాబాద్ నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో అత్యంత కీలకమైన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అత్యాధునిక హంగులతో రెడీ అవుతోంది. దేశంలోని అతిపెద్ద రవాణా కేంద్రాలలో ఒకటిగా ఉన్న ఈ స్టేషన్‌ను ఎయిర్‌పోర్టుకు ఏమాత్రం తీసిపోని విధంగా తీర్చిదిద్దేందుకు దక్షిణ మధ్య రైల్వే రూ. 700 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. ప్రస్తుతం ఈ పనులు 60 శాతం పూర్తయ్యాయని.. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. స్టేషన్ ఆధునీకరణలో భాగంగా.. రెండంచెల ఎయిర్ కాంకోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ సుమారు 1.5 లక్షల మంది ప్రయాణికులు, 180 రైళ్లతో కిక్కిరిసిపోయే ఈ స్టేషన్‌లో రద్దీని నియంత్రించేందుకు ఇది కీలకం కానుందని అన్నారు. మొదటి అంతస్తులో విశాలమైన వెయిటింగ్ ఏరియా ఉంటుందని.. రెండో అంతస్తులో ఫుడ్ కోర్టులు, రిటైల్ షాపులు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల ప్లాట్‌ఫారమ్‌లపై అనవసరమైన రద్దీ తగ్గి, ప్రయాణికులు సాఫీగా రైలు ఎక్కేందుకు వీలుంటుందన్నారు. ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు వేర్వేరుగా ఉండటంతో తోపులాటలకు ఆస్కారం ఉండదని అంటున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్ విధానంలో అభివృద్ధి చేస్తుట్టన్లు చెప్పారు. సికింద్రాబాద్ ఈస్ట్, వెస్ట్ మెట్రో స్టేషన్ల నుండి రైల్వే స్టేషన్‌కు నేరుగా స్కైవాక్‌లను నిర్మిస్తున్నారు. దీనివల్ల ప్రయాణికులు రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్ ఎదుర్కోవాల్సిన అవసరం లేకుండానే.. నేరుగా మెట్రో స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్‌కు చేరుకోవచ్చు. ఇది ప్రయాణ సమయాన్ని ఆదా చేయడమే కాకుండా భద్రతను కూడా పెంచుతుందని అభిప్రాయపడుతున్నారు. స్టేషన్‌ను పర్యావరణహితంగా 5000 ఖవ్రా సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్, 100 వాహనాల కోసం ఈవీ ఛార్జింగ్ పాయింట్లు, 500 ఖూ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేసి స్టేషన్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని చెబుతున్నారు. కాగా, తెలంగాణలోని 40 స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా.. అభివృద్ధి చేస్తున్నారు. హైదరాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్ కూడా ఈ పథకంలో భాగంగానే రూ. 327 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ స్టేషన్‌లోనూ మెట్రో స్టేషన్‌కు అనుసంధానంగా ట్రావలేటర్లతో కూడిన ఎఫ్ఓబీ నిర్మిస్తున్నారు. నగరంలోని ఇతర స్టేషన్లను మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని స్టేషన్ల రూపురేఖలు మారిపోగా.. మరికొన్ని స్టేషన్లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

# మహిళల బిజినెస్‌కు భారీ ప్రోత్సాహం

హైద్రాబాద్: మహిళా సాధికారతను మరింత బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రారంభించిన పెట్రోల్ బంకులు లాభదాయకంగా నడుస్తుండటంతో, ఈ మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న రెండు పెట్రోల్ బంకులు మంచి ఆదాయం అందిస్తుండటంతో, ఇదే విధానాన్ని మరిన్ని ప్రాంతాల్లో అమలు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా మరో 40 పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు పూర్తి చేసి, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. ఈ ప్రణాళిక వెనుక ప్రధాన లక్ష్యం మహిళలను ఆర్థికంగా స్వావలంబనగా తీర్చిదిద్దడం. ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా అమలు చేస్తున్న 'ఇందిరా మహిళా శక్తి' పథకం ద్వారా మహిళా సంఘాలకు వ్యాపార అవకాశాలు కల్పిస్తూ, వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కింద ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకుల ప్రత్యేకత ఏమిటంటే, ఇవి పూర్తిగా మహిళల చేత నిర్వహించబడుతున్నాయి. సిబ్బంది నుంచి యాజమాన్యం వరకు అన్ని బాధ్యతలు మహిళలదే కావడం విశేషం. ఇప్పటివరకు సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల్లో ఏర్పాటు చేసిన బంకులు ఆదర్శంగా నిలుస్తూ మంచి ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. ఇప్పటికే కొత్త బంకుల కోసం అవసరమైన భూముల ఎంపిక పూర్తయింది. ఈ ప్రాజెక్ట్ అమలులో భాగంగా Indian Oil Corporation, Bharat Petroleum, Hindustan Petroleum వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వీటి సహకారంతో నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి సేవలను ప్రారంభించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా, ఈ 40 పెట్రోల్ బంకుల్లో సుమారు 20ను జూన్ 2 నాటికి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్, నల్గొండ, కుమురం భీమ్, పెద్దపల్లి, వికారాబాద్ వంటి ప్రాంతాల్లో నిర్మాణాలు జరుగుతుండగా, కరీంనగర్, మెదక్, ములుగు, సిరిసిల్ల జిల్లాల్లో కూడా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మరోవైపు హనుమకొండ, ఖమ్మం, కామారెడ్డి, కొత్తగూడెం, జనగామ, జగిత్యాల, భూపాలపల్లి, మహబూబ్‌నగర్, మేడ్చల్, మంచిర్యాల, నిర్మల్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వనపర్తి, సూర్యాపేట, వరంగల్, భువనగిరి, సంగారెడ్డి జిల్లాల్లో భూములు ఇప్పటికే మహిళా సంఘాలకు కేటాయించారు. ఇంకా కొన్ని జిల్లాల్లో భూముల గుర్తింపు పూర్తయినప్పటికీ, అప్పగింత ప్రక్రియ కొనసాగుతోంది. సిద్దిపేట, నిజామాబాద్, జోగులాంబ గద్వాల్, మహబూబాబాద్ వంటి ప్రాంతాల్లో త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తికానుంది. మొత్తంగా, ఈ ప్రాజెక్ట్ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం అవుతాయని అధికారులు భావిస్తున్నారు. మహిళల ఆధ్వర్యంలో నడిచే ఈ పెట్రోల్ బంకుల విస్తరణ తెలంగాణలో మహిళా శక్తిని మరింత బలోపేతం చేయడమే కాకుండా, ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచే అవకాశముంది.

## సీబీయూడీ యాప్‌ను వినియో గించుకోవాలి

గద్వాల : ఏ ప్రాంతంలోనైనా సంబంధిత శాఖలు తమ అవసరాల నిమిత్తం తవ్వకాలు జరిపే సమయంలో టెలికాం కేబుల్స్‌కు నష్టం జరుగకుండా ముందస్తు సమాచారం ఇవ్వడం సీబీయూడీ (కాల్ బిఫోర్ యు డిగ్) యాప్ ముఖ్యఉద్దేశం అని జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ త్రైమాసికం టెలికాం కమిటీ సమావేశాన్ని నిర్వహించాలన్నారు. టెలికాం సేవలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ మెరుగుదల, ఆయా విభాగాల మధ్య సమన్వ యం ప్రధానమన్నారు. రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, విద్యుత్, మునిసిపల్ తదితర సంబంధిత శాఖలు తప్పనిసరిగా ఈ యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. టెలీ కమ్యూనికేషన్ చట్టం ప్రకారం టెలికాం నెట్‌వర్క్‌కు నష్టం కలిగించే చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధ్యుల సమస్యలు వెంటనే పరిష్కరించి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంత గ్రామాలలో ఇంట ర్నెట్ సదుపాయాన్ని కల్పించేందుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, కలెక్టరేట్ ఏవో భూపాల్‌రెడ్డి, బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈ లక్ష్మీకాంత్, టీ–ఫైబర్ జోనల్ మేనేజర్ ఈశ్వర్, జిల్లా మేనేజర్ వేణు తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరస్థుల వలలో చిక్కి మోసపోవద్దు

సిరిసిల్ల : సైబర్ నేరస్థుల వలలో చిక్కుకుని వారి మాయమాటలను నమ్మి మోసపోవద్దని సిరిసిల్ల టౌన్ సీఐ శ్రీనివాస్ కోరారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మీ కోసం కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ డబుల్ బెడ్‌రూం కాలనీవాసులతో సమావేశాన్ని నిర్వహించారు. గంజాయి, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్‌ల మోసాలు, సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్స్, మహిళా చట్టాలు, షీ టీమ్, నూతన చట్టాలతో పాటు సీసీ కెమెరాల ఆవశ్యకతల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. సైబర్ నేర గాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా మోసపోయినట్లయితే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయ డం జరుగుతుందని, తద్వారా ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడువద్దన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా చేయడంలోనే నిజమైన సంతృప్తి



మహబూబ్ నగర్ : సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మార్కెట్ యార్డ్ లో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ఉండేందుకు చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా మార్కెట్ ప్రాంతాలకు రోజూ భారీ సంఖ్యలో వచ్చే వ్యాపారులు, కూలీలు, వినియోగదారులు తీవ్రమైన ఎండల కారణంగా ఇబ్బందులు పడకుండా ఉండేం దుకు చలి వేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కార్పొరేటర్ అనురాధ చిన్నని ప్రశంసించారు. అనంతరం నిర్మాణం లో ఉన్న వెజ్, నాన్ వెజ్ మార్కెట్ భవనాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా గుత్తేదారుతో నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, వర్షాకాలంలో వర్షపు నీరు మార్కెట్ లోపలికి చేరకుండా సమగ్ర డ్రైనేజ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. వ్యాపారస్తులకు ఉపయోగపడే విధంగా మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతను కాపాడుతూ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని గుత్తేదారుకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈసందర్భంగా వీధి వ్యాపారులతో ముచ్చటించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పండ్ల వ్యాపారులను ప్రోత్సహిస్తూ స్వయంగా పండ్లు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, స్థానిక నాయకులు వర్ధ రవి, మార్కెట్ వ్యాపారులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రకృతి బాగుంటేనే ప్రజారోగ్యం



హైదరాబాద్, : ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అమీర్‌పేటలోని అస్టర్ ప్రైమ్ హాస్పిటల్ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో పర్యావరణం కీలక పాత్ర పోషిస్తుందనే సందేశాన్ని చాటుతూ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీనియర్ వైద్యులు, మెడికల్, నాన్–మెడికల్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కేవలం వ్యాధుల చికిత్సకే పరిమితం కాకుండా, సంపూర్ణ ఆరోగ్యానికి పర్యావరణ పరిరక్షణ కూడా ముఖ్యమని వైద్యులు గుర్తుచేశారు. పర్యావరణంతో పాటు మానసిక ఆరోగ్యం పట్ల కూడా అవగాహన కల్పించారు. ఒత్తిడి లేని జీవనశైలిని అలవర్చుకోవాలని, భావోద్వేగ సమతుల్యతను పాటిం చాలని సిబ్బందికి సూచించారు. ప్రస్తుత కాలంలో శారీరక ఆరోగ్యంతో సమానంగా మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. అస్టర్ ప్రైమ్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ హరి కుమార్ రెడ్డి మాట్లాడుతూ 'ఆరోగ్యం అంటే కేవలం రోగాలు లేకపోవడం మాత్రమే కాదు; శారీరక, మానసిక, పర్యావరణ సమతుల్యత కలిగి ఉండటం. ఈ రోజు మేము నాటిన ఈ మొక్క, ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం మా నిబద్ధతకు ప్రతీక. నేడు మనం తీసుకునే చిన్నపాటి జాగ్రత్తలే రేపటి సమాజ ఆరోగ్యంపై గొప్ప ప్రభావాన్ని చూపుతాయి', అని పేర్కొన్నారు. అన్ని విభాగాల సిబ్బంది కలిసికట్టుగా పాల్గొన్న ఈ కార్యక్రమం, నివారణ ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ స్పృహ పట్ల ఆసుపత్రికి ఉన్న బాధ్యతను చాటిచెప్పింది.

# నిమ్స్‌లో ట్రూబీమ్ రేడియేషన్ యంత్రం



హైద్రాబాద్: తెలంగాణ ప్రభుత్వం వైద్యారోగ్యశాఖను బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ఇప్పటికే జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. కొత్త ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణం, వైద్య సిబ్బంది నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇక పెద్దాసుపత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలతో పేదలకు వైద్యం అందిస్తున్నారు. తాజాగా.. ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్‌కే పరిమితమైన అత్యాధునిక రేడియేషన్ థెరపీ చికిత్సలు హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో అందుబాటులోకి వచ్చాయి. అత్యంత కచ్చితత్వంతో కూడిన రేడియేషన్ ట్రీట్‌మెంట్ అందించే ట్రూబీమ్ లీనియర్ యాక్సిలరేటర్ యంత్రాన్ని హాస్పిటల్‌లో ప్రవేశపెట్టారు. దీని ధర రూ.30 కోట్ల వరకు ఉంటుందని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తెలిపారు. సాధారణ రేడియేషన్ థెరపీతో కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. క్యాన్సర్ కణితులతోపాటు పక్కనే ఉన్న ఆరోగ్యకరమైన కణాలూ దెబ్బతిని పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం అత్యాధునిక ట్రూబీమ్ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యంత్రం హైరెజల్యూషన్ ఇమేజింగ్‌తోపాటు ట్యూమర్ కదలికను ట్రాక్ చేసి నాశనం చేస్తుంది. క్యాన్సర్ కణితి చుట్టూ ఉన్న ఆరోగ్యకరమైన కణజాలానికి ఏ మాత్రం నష్టం చేయకుండా రేడియేషన్ చేస్తుంది. చర్మంపై నుంచి ట్యూమర్ ఎంత లోతు కణజాలంలో ఉన్నా దానిని పక్కగా గుర్తించి తొలగిస్తుంది. ఫలితంగా లోతుగా ఉన్న వీర్యగ్రంథి, క్లోమగ్రంథి, కాలేయంలో ఉన్న క్యాన్సర్ కణితులకు సైతం సర్జరీ అవసరం లేకుండా చికిత్స చేసే అవకాశం ఉంటుందని నిమ్స్ డాక్టర్లు వెల్లడిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతతో మెదడు, ఊపిరితిత్తులు, వెన్నెముక, కాలేయం వంటి సున్నిత ప్రాంతాల్లోని అతి చిన్న ట్యూమర్లను తక్కువ సెషన్లతో అత్యధిక డోసుతో ట్రీట్‌మెంట్ అందిస్తుంది. ఈ ట్రూబీమ్ ద్వారా ఒక్కో సెషన్ కొన్ని నిమిషాల్లోనే పూర్తవుతుందని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తెలిపారు. ప్రైవేటులో రూ.లక్షలు వ్యయమయ్యే చికిత్సలను నిమ్స్ హాస్పిటల్‌లో పేదలకు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. మిగతా వారికి అతి తక్కువ ఖర్చుతో ట్రీట్‌మెంట్ అందించనున్నట్లు డాక్టర్ బీరప్ప వెల్లడించారు. ఇక అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) హాస్పిటల్ కేవలం రాష్ట్ర ప్రజలకే కాకుండా విదేశీ రోగులకు కూడా అందుబాటులోకి తీసుకురావాలని సర్కార్ నిర్ణయించింది. జూన్ 2న సనత్ నగర్, అల్వాల్ టిమ్స్ ఆస్పత్రులను ప్రారంభించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోండగా.. ఇందులో విదేశీ రోగులకు కూడా చికిత్సలు అందించనున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రత్యేక ఇంటర్నేషనల్ పేషెంట్ వింగ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## అంగన్‌వాడీ కార్యక్రమాలన్నీ అప్‌లోడ్ చేయాలి

గద్వాల : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు మొబైల్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న ప్రతీ విషయంలో యాప్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఎంతమంది విద్యార్థులు అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్నారు. వారికి పౌష్టికాహారమైన ఆహారాలు ప్రభుత్వం నుంచి వస్తున్న విషయాలు, గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు సరఫరా చేసే వివరాలను నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సునంద, సీడీపీవోలు కీర్తి, హేమలత, జిల్లా అధ్యక్షురాలు ఇందిరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280